క్లుప్తంగా

కలెక్టరేట్‌ ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్‌ : మున్సిపల్‌ టీచర్ల సమస్యల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏపీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం కడప కలెక్టరేట్‌ కార్యాలయం ముందు ఏపీటీఎఫ్‌ ఆధ్వర్యంలో మున్సిపల్‌ టీచర్ల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌ టీచర్లకు సర్వీస్‌ రూల్స్‌ రూపొందించాలన్నారు. మున్సిపల్‌ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతో ప్రావిడెంట్‌ ఫండ్‌ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అడిట్‌ కమిటీ సభ్యులు క్రిష్టారెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు , జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



జాకటి బాలకృష్ణ ప్రసాద్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా జాకటి బాలకృష్ణ ప్రసాద్‌, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా పాతకడప వాసులను గురువారం నియమించారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు నియమాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

అభినందన



పేటెంట్‌ పత్రాన్ని వైవీయూ అధికారులకు చూపుతున్న డా. సరిత

వైవీయూ : భారత ప్రభుత్వం నుంచి డిజైన్‌ పేటెంట్‌ పొందిన వైవీయూ ఎంబీఏ శాఖ సహ ఆచార్యులు డా. పి. సరితను వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వం నుంచి 'డిజైన్‌ పేటెంట్‌'లో ఇంటలెక్చువల్‌ ప్రాపర్టీ రైట్‌ ఆమోదం పొందడం పట్ల గురువారం విశ్వవిద్యాలయంలో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా డా. సరిత మాట్లాడుతూ తాము తయారు చేసిన పరికరం కార్యాలయాల సమాచారాన్ని తీసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగుల అభిప్రాయాన్ని అభ్యర్థిస్తుందని, లక్ష్యాలు, రివార్డులు, మంచి పనితీరును సిద్ధం చేస్తుందని వివరించారు.

పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అధిక పాలసీలు చేసిన సిబ్బందికి బహుమతులను అందజేస్తున్న పోస్టల్‌ సూపరింటెండెంట్‌ రాజేష్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ రాజేష్‌ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పోస్టల్‌ ప్రధాన కార్యాలయంలో పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ 140వ వార్షికోత్సవం సందర్భంగా కేక్‌ను కట్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకైక ఇన్సూరెన్స్‌ అని చెప్పారు. అనంతరం అధిక పాలసీలు చేసిన సిబ్బందికి బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప డివిజన్‌ ఏఎస్పీలు అంచెల విజయ భాస్కర్‌, భాస్కర్‌ రెడ్డి పాల్గొన్నారు.

వల్లూరు ఎంపీడీవోగా విజయభాస్కర్‌

వల్లూరు : స్థానిక ఎంపీడీవోగా విజయభాస్కర్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న జయశ్రీని ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల ఎంపీడీవోగా పని చేస్తున్న విజయభాస్కర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ప్రజల వద్దకు పాలన జగనన్నతోనే సాధ్యం

చింతకొమ్మదిన్నె : ప్రజల వద్దకే పాలన రావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌ రామాంజులురెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని ఇప్పపెంట, పాపాసాహెబ్‌పేట పంచాయతీల్లోని గ్రామ సచివాలయాలతో పాటు, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌ క్లినిక్‌లను వారు ప్రారంభించి మాట్లాడారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కూడా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రేషన్‌ కార్డు కావాలన్నా, పింఛన్‌ కావాలన్నా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ, ఎంపీడీవో కార్యాలయం చుట్టూ, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుతం జగనన్న పరిపాలన వచ్చిన తర్వాత జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్‌ వ్యవస్థ ప్రతి కుటుంబానికి దగ్గరుండి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు.

మేమేం చేశామో కడప ప్రజలకు తెలుసు

- మాధవీ రెడ్డీ.. కోవిడ్‌ కష్ట కాలంలో నీవెక్కడున్నావమ్మా...?
- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సూటి ప్రశ్నలు



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్‌ : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీ రెడ్డిపై ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అనవసరంగా నోరు పారేసుకోవద్దని హితవు పలికారు. గురువారం స్థానిక వైఎస్సార్‌ ఆడిటోరియంలో ఇంటి పట్టాల పంపిణీ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడారు. కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్న మాధవీరెడ్డి ఎన్నికల వేళ కొంతమంది పెయిడ్‌ ఆర్టిస్టులను, కెమెరామెన్లను వెంటేసుకొని కడప నగరానికి వచ్చారని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా గుంత కనబడితే చాలు అక్కడ ఆగి ఇదేనా అభివృద్ధి అని, ఇరుకైన రోడ్లు ఉన్నాయంటూ ప్రశ్నించడం దారుణమన్నారు. కడప అంటే నీకు ఏం తెలుసు... మేము ఇక్కడే పుట్టాం, ఇక్కడే పెరిగాం...కడప ఎప్పటినుంచో ఇలాగే ఉంది. వైఎస్సార్‌ వచ్చిన తర్వాత ఇది అభివృద్ధి అయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరింత అభివృద్ధి అవుతోందని తెలిపారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ అధికారంలో ఉంది...చంద్రబాబు సీఎంగా ఉంటే, నీ భర్తే కడపకు ఇన్‌చార్జిగా ఉన్నారు కదా...కడప నగరానికి ఏం తీసుకొచ్చావమ్మా అని సూటిగా ప్రశ్నించారు. కోవిడ్‌ కష్టకాలంలో నేనేం చేశానో, మా కార్పొరేటర్లు, నాయకులు ఏం చేశారో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. అప్పుడు కడప ప్రజలు నీకు గుర్తుకు రాలేదా...ఒక్కరికైనా బెడ్‌ ఇప్పించావా, సిలిండర్‌ సాయం చేశావా, నీళ్లప్యాకెట్‌ అయినా అందించావా అని ప్రశ్నల వర్షం కురిపించారు. డబ్బుందనే అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కడప ప్రజలు మీ అహంకారాన్ని, రౌడీయిజాన్ని తిప్పికొడతారని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. టీడీపీ కుట్రలు, కుతంత్రాలకు, డబ్బుకు మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మన భవిష్యత్‌ బాగుపడాలంటే మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలం అందజేసి, మెరుగైన వసతులు కల్పిస్తున్నారన్నారు. అల్పాదాయ కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు.

- మేయర్‌ సురేష్‌ బాబు మాట్లాడుతూ మాటల ప్రభుత్వానికి, చేతల ప్రభుత్వానికి ఉన్న తేడాను ఇప్పటికే రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. మన ముఖ్యమంత్రి రాష్ట్రాన్నే కాకుండా.. సొంత జిల్లాను కూడా అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో పారిశ్రామికంగా, విద్యాపరంగా, వైద్య పరంగా, ఉపాధి పరంగా అన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి.. అనతి కాలంలోనే ప్రారంభోత్సవాలు కూడా చేయడం గొప్ప విషయం అన్నారు. జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించే దిశగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆవరణలో క్యాన్సర్‌, కంటి, మానసిక, సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రారంభించారన్నారు. కడప నగరాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా అభివృద్ధి చేయడం జరుగుతోందని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండటం మనకు ఆ దేవుడు అందించిన గొప్ప వరం అన్నారు. ఆ తర్వాత పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు.
- ఈ కార్యక్రమంలో సోషియల్‌ వెల్ఫేర్‌ బోర్డు చైర్మన్‌ పులి సునీల్‌ కుమార్‌, తహసీల్దార్‌ శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ ఖాన్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, దాసరి శివ ప్రసాద్‌, సుబ్బరాయుడు, కార్పొరేటర్లు కె.సూర్యనారాయణరావు, అరీఫుల్లా బాషా, అజ్మతుల్లా, షంషీర్‌ పాల్గొన్నారు.

రేపు భక్తి నృత్యోత్సవం

కడప కల్చరల్‌ : కడప నగర పరిధిలోని చెన్నై రోడ్డు లోగల శ్రీ లలితా పంచాయతన ఆలయంలో శనివారం సాయంత్రం 6.15 గంటలకు 'ఆయన' పేరిట ఆధ్యాత్మిక నృత్యోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఇంటాక్‌ జిల్లా చాప్టర్‌ కన్వీనర్‌ లయన్‌ కె.చిన్నపరెడ్డి తెలిపారు. అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో దేశ విదేశాల్లో పేరుగాంచిన ప్రముఖ నృత్యకారుల ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు తప్పక తిలకించాలని కోరారు.

బీజేపీ సహకారంతో రాష్ట్రాభివృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలో బీజేపీ కడప లోక్‌ సభ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి గురువారం వర్చువల్‌ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల సందర్భంగా జిల్లాలో బీజేపీ బలోపేతంపై దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా కడప పార్లమెంటరీ అధ్యక్షులుగా బొమ్మన సుబ్బారాయుడును పార్టీ నియమించిందని ఆయన తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌ : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీలకు సంక్షేమ పథకాలు సంతృప్తిగా అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక 31వ డివిజన్‌లోని దిశ పోలీస్‌స్టేషన్‌ సందు, గుర్రాలగడ్డ ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా అర్హులెవరికైనా పథకాలు అందలేదా అని ఆరా తీశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేసి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకున్న వైఎస్‌ జగన్‌ వారి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉన్నా ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. సంవత్సరంలో ప్రతినెలా క్యాలెండర్‌ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ అని కొనియాడారు.

- సయ్యద్‌ నసీం అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్‌ చేయూత, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఇంటి స్థలం పథకాల ద్వారా రూ.11.25లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరింది.
- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్‌, హరూన్‌ గ్రూప్స్‌ ఎండీ అహ్మద్‌బాషా, 31వ డివిజన్‌ కార్పొరేటర్‌ అజ్మతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బీహెచ్‌ ఇలియాస్‌, సీహెచ్‌ వినోద్‌, ఐస్‌క్రీం రవి, కె. సూర్యనారాయణరావు, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, త్యాగరాజు, ఎస్‌. సుబ్బారెడ్డి, పస్తం అంజి, అర్జున్‌, రహీం, దత్తసాయి, డా. శివానాయక్‌, భాస్కర్‌రావు, మల్లీశ్వరి పాల్గొన్నారు.
- తొలుత దిశ పోలీస్‌స్టేషన్‌ సమీపంలో సీఎండీఎఫ్‌ నిధులు రూ.25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా భూమిపూజ చేశారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

రామాలయ నిర్మాణ పనుల భూమిపూజలో పాలు పంచుకోవడం తన మనసుకు ఎంతో సంతోషాన్నిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌.బి.అంజాద్‌ బాషా అన్నారు. గురువారం కడప నగరపాలక సంస్థ పరిధిలోని బహుజన్‌ నగర్‌ లో రూ.25 లక్షల ప్రజల విరాళాలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన రామాలయ నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌.బి.అంజాద్‌ బాషా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్‌ సురేష్‌ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌ బాషా మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో, ప్రజల విరాళాలతో ఆలయాన్ని నిర్మించ తలపెట్టిన 15వ డివిజన్‌ ప్రజా ప్రతినిధులు, నాయకులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ పుణ్య కార్యంలో తనను కూడా భాగస్వామ్యం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్‌ కార్పొరేటర్‌ కె. లక్ష్మీ దేవి, డివిజన్‌ ఇంచార్జి వీరారెడ్డి, పి. జయచంద్రా రెడ్డి, వెంకటేష్‌, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లూర్దుమాత నవదిన ఉత్సవాలు



లూర్దుమాత ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్రైస్తవ గురువులు

కడప కల్చరల్‌ : కడప నగరం మరియాపురంలో వెలిసిన లూర్దుమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాలు శుక్రవారం నుంచి పది రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ క్షేత్రం విచారణ గురువులు ఫాదర్‌ బిరుసు రాజా తెలిపారు. గురువారం మరియాపురం పాత చర్చి ఆవరణలో ఆయన ఎంపీఎస్‌ఎస్‌ఎస్‌ డైరెక్టర్‌ తలారి బాలరాజు, సహాయ గురువు ఫాదర్‌ అరుణ్‌తో కలిసి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, చివరిరోజు జరిగే తిరునాల జిల్లాలో నిర్వహించే అతి పెద్ద ఉత్సవమని వివరించారు. క్రైస్తవ గురువు ఫాదర్‌ ఫ్రాన్సిస్‌ క్రంబ్లిష్‌ ఈ ప్రాంతాన్ని పవిత్ర లూర్దు మాత క్షేత్రంగా ప్రకటించి 1935లో చర్చిని స్థాపించారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యేటా నవదిన ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు కడప నగరంతోపాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారన్నారు. చివరిరోజు తిరునాల ఎంతో సందడిగా నిర్వహిస్తామని, ఈ సందర్భంగా పలు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు.

- ఈ నెల 2న సాయంత్రం 5.30 గంటలకు ఫాదర్‌ స్వర్ణబెర్నాడ్‌ పతాకావిష్కరణ చేసి దివ్య బలిపూజ సమర్పిస్తారని, రెవరెండ్‌ ఫాదర్‌ నెల్లూరు ప్రాంతీయ పాస్టరల్‌ సెంట్రర్‌ డైరెక్టర్‌ ఫాదర్‌ గాలి బోస్కో ప్రసంగిస్తారని, క్యథడ్రల్‌ గాయక బృందం క్రైస్తవ భక్తి గీతాలను ఆలపిస్తారని తెలిపారు.
- 3న సాయంత్రం 5.30 గంటలకు బద్వేలు విచారణ గురువు ఫాదర్‌ గొడుగునూరు విజయరావు దివ్య బలిపూజ సమర్పిస్తారని, ఫాదర్‌ లక్కినేని ఆరోగ్యరాజ్‌ ప్రసంగిస్తారని తెలిపారు.
- 4న ఫాదర్‌ గుడిమె జేసుదాస్‌ దివ్యబలిపూజ, ఫాదర్‌ ఆకుల ప్రసాద్‌ ప్రసంగం ఉంటాయన్నారు.
- 5న వేంపల్లె విచారణ గురువు ఫాదర్‌ మెల్ల బాలస్వామి, చెన్నూరు విచారణ గురువు ఫాదర్‌ లక్కినేని పీటర్‌ ప్రభాకర్‌ల దివ్యబలిపూజ, ప్రసంగం ఉంటాయన్నారు.
- 6న మైదుకూరు విచారణ గురువు ఫాదర్‌ బల్లారపు ఆశీర్వాదం, శివాడి విచారణ గురువు ఫాదర్‌ దాసరిపల్లి సుమన్‌ల దివ్య బలిపూజ, ప్రసంగాలు ఉంటాయన్నారు.
- 7న ఎర్రగుంట్ల విచారణ గురువు ఫాదర్‌ ఇట్ట మోసెస్‌, ఉరుటూరు విచారణ గురువు ఫాదర్‌ కాసు జోజిరెడ్డి, 8న బిషప్స్‌ హౌస్‌ సెక్రటరీ ఫాదర్‌ చైతన్య కింగ్‌, ఆమగంపల్లి విచారణ గురువు ఫాదర్‌ ఉబ్బరపు దేవరాజు, 9న రాయచోటి విచారణ గురువులు ఫాదర్‌ కల్లుట్ల ప్రభుకుమార్‌, ఫాదర్‌ కైపు చంద్రలు దివ్య బలిపూజ సమర్పిస్తారని, అనంతరం ప్రసంగం ఉంటుందని తెలిపారు.
- 10న సాయంత్రం 5.00 గంటలకు డాన్‌ బాస్కో ఐటీఐలో సంస్థ ఫాదర్లు దివ్యబలిపూజ సమర్పిస్తారని, సంస్థ కడప డీన్‌ ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌రావు ప్రసంగిస్తారన్నారు.
- 11న ఉదయం 10.00 గంటలకు మరియాపురం చర్చి ఆవరణలో లూర్దుమాత మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కడప అపోస్తలిక పాలనాధికారి, పీఠాధిపతి బిషప్‌ గాలిబాలి దివ్య బలిపూజ సమర్పించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం కడప నగరంలోని ప్రముఖ కూడళ్ల ద్వారా మరియమాత ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. రాత్రి 10 గంటలకు కడప మేత్రాసన విద్యా సంస్థల చిన్నారుల క్రైస్తవ భక్తి నృత్య పోటీలు ఉంటాయని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న బిందులత

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : తనతోపాటు తన భర్త పై దాడి చేసి ఇంటిలో సామగ్రిని ధ్వంసం చేసి దోచుకెళ్లిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నగరానికి చెందిన పాలెం బిందులత, ఆమె భర్త సీవీ రమణరావు కోరారు. ఈ మేరకు గురువారం వారు మీడియాతో మాట్లాడారు. కడప రైల్వే స్టేషన్‌ రోడ్‌ శ్రీరామనగర్‌లోని కలెక్టర్‌ బంగ్లాకు సమీపంలో నివాసముంటున్న తమపై 40 మంది గూండాలు దాడి చేసి ఇల్లు ధ్వంసం చేశారని, రెండు ట్రాక్టర్లతో తమ ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంటిలో ఉన్న సామగ్రిని దోచుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటిలోని ఫర్నిచర్‌ ఎలక్ట్రానిక్‌ వస్తువులు బంగారు, విలువైన వస్తువులు 17 లక్షల వరకు, అదేవిధంగా పక్కనే ఉన్న పాలెం యోగేంద్ర, కాంతమ్మ ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇల్లు ధ్వంసం చేసి ఆరు లక్షల విలువ చేసే సామాన్లు దోచుకెళ్లారని తెలిపారు.తమ తమ్ముడు పాలెం గౌతమ్‌ చంద్రకాంత్‌ ఆస్తిలో తనకు కూడా వాటా ఇవ్వాల్సి వస్తుందని, ఇంటిలో నుంచి తరిమికొట్టేందుకు 40 మంది గుండాలను తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. తమపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓలుగా లలిత, సుమిత్ర



ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓలకు నియామక పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఆఫీసర్లుగా సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డా. కె. లలిత, ఎన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌ సహ ఆచార్యులు డా. సుమిత్రను నియమించారు. బుధవారం వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి వారికి నియామక పత్రాలను అందజేశారు. కాగా ఇప్పటి వరకు ఈ బాధ్యతలు నిర్వహించిన డా. టి. చంద్రశేఖర్‌, డా. వసుగోవర్ధన్‌రెడ్డి పీఓ పదవుల నుంచి రిలీవ్‌ అయ్యారు.

ప్రతి వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్‌ ధరించాలి



నగరంలో హెల్మెట్‌ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న రవాణా, పోలీసు శాఖ అధికారులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌, ఫోర్‌ వీలర్‌ వాహనదారులు కచ్చితంగా సీటు బెల్ట్‌ను ధరించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌ ఈ. మీరా ప్రసాద్‌, అడిషనల్‌ ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రహదారి ప్రమాద మరణాలలో అధిక శాతం కారులో ప్రయాణం చేసేటప్పుడు సీటు బెల్టు ధరించకపోవడం, టూ వీలర్‌ ప్రయాణంలో హెల్మెట్‌ ధరించకపోవడం వల్ల జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు విజయభాస్కర్‌, ప్రసాద్‌, లక్ష్మీ ప్రసన్న, ట్రాఫిక్‌ సీఐ సీతారామిరెడ్డి, ఐసీడీఎస్‌ సిబ్బంది టూ వీలర్‌ డీలర్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తమవంతుగా కృషి చేయాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చీఫ్‌ మేనేజర్లు పుల్లయ్య, నరసింహారావు, రవికుమార్‌లు పిలుపునిచ్చారు. గురువారం ఏపీజీబీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడ-2024లో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఈ విషయంగా ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ అధికారులు రవిమోహన్‌, కామేశ్వరరావు, రసూల్‌ సాహెబ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ స్పెషల్‌ క్యాంపు ప్రారంభం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌-1 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్‌ స్పెషల్‌ క్యాంపు గురువారం ప్రారంభమైంది. కడప నగర సమీపంలోని రామనపల్లె గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ డా. ఎన్‌. వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవను బాధ్యతగా భావించి ఆదర్శ విద్యార్థులుగా ఖ్యాతి గడించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డా. జి. విజయలక్ష్మి మాట్లాడుతూ 7 రోజుల పాటు ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్రంలోని మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్‌ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు నిలబడే ప్రాంతీయ పార్టీలపై నేడు బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐలను ప్రయోగించి బెదిరించడం దారుణమన్నారు. దేశంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని మట్టి కరిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దఫా ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ వ్యవస్థను మార్చేందుకు వెనుకాడదన్నారు. బీజేపీకి లొంగిపోయినందుకు నితీష్‌ కుమార్‌ ముఖ్యమంత్రి పీఠం కాపాడుకున్నారని, లొంగని హేమంత్‌ సొరైన్‌ జైల్లో ఉన్నాడన్నారు. సెక్యులర్‌ సిద్ధాంతాలకు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉండాలన్నారు. జనసేన పార్టీ ద్వారా రాష్ట్రంలో బీజేపీ పాగా వేయాలని కుట్ర పన్నుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మనోహర్‌, రామ్మోహన్‌, శివకుమార్‌, శ్రీనివాసుల రెడ్డి, దస్తగిరి రెడ్డి, ఐఎన్‌ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామాయణం ఉత్తమ జీవన విధానం

కడప కల్చరల్‌ : రామాయణం ఉత్తమ జీవన విధానమని హిందూ ధర్మం సొసైటీ ప్రేయర్‌ టెంపుల్స్‌ ఆర్గనైజేషన్‌ చైర్మన్‌ పసుపులేటి శంకర్‌ అన్నారు. గురువారం స్థానిక పాతకడపలోని శ్రీ సీతారాముల ఆలయంలో స్థానిక భక్తులతో కలిసి ఆయన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ రామాయణం మానవుల ఉన్నత స్థాయి జీవితానికి ప్రమాణమని, సర్వజనీన ఆదర్శమైన గ్రంథమని, రాముడు ఆదర్శ పురుషుడే కాకుండా మర్యాద పురుషోత్తముడని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. మైదుకూరు స్పెషల్‌ జ్యుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ వరప్రసాద్‌, పురావస్తుశాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, సంస్థ జాతీయ వైస్‌ చైర్మన్‌ సోము కళానాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బలుసా జనార్దన్‌శ్రేష్టి, సంయుక్త కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఈ సేవలు మరువలేనివి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్‌ అధికారులు

కడప కార్పొరేషన్‌ : తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్‌ ఇంజనీరు హరినారాయణరెడ్డి సేవలు మరువలేనివని రాయలసీమ క్వాలిటీ కంట్రోల్‌ చీఫ్‌ ఇంజనీరు కె.శ్రవణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం హరినారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం స్థానిక తెలుగుగంగ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈ స్థాయి నుంచి ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన హరినారాయణరెడ్డి అంచెలంచెలుగా చీఫ్‌ ఇంజనీరు స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. రాయలసీమలోని పలు ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం హరినారాయణరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్‌ఈ వెంకట్రామయ్య, ఇరిగేషన్‌ సర్కిల్‌ ఎస్‌ఈ కె.శ్రీనివాసులు, కన్‌స్ట్రక్షన్‌ సర్కిల్‌ ఎస్‌ఈ ఇలియాస్‌బాష, క్వాలిటీ కంట్రోల్‌ డిజైన్‌ ఓ.శారద, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టెక్‌వేవ్‌-2024 సాంకేతిక ప్రదర్శన

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో శనివారం టెక్‌వేవ్‌-2024 సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ బి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఇన్నోవేషన్‌ సెల్‌ ఆధ్వర్యంలో లైవ్‌ డిప్లమో ప్రాజెక్టులు, సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణల సాంకేతిక ప్రదర్శన టెక్‌వేవ్‌-2024ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కమలాపురం పట్టణంలో మొదటి సారిగా ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని డిప్లమో విద్యపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు సాంకేతిక ప్రదర్శన సందర్శించాల్సిందిగా ప్రిన్సిపాల్‌ తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచిన ప్రాజక్టులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డికి సమస్యలను తెలియజేస్తున్న కార్మిక పరిషత్‌ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కార్మిక పరిషత్‌ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యల కారణంగా ఉద్యోగులు సతమతమవుతున్నారని తెలియజేశారు. యూనియన్లకు అతీతంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు జిల్లా ప్రజా రవాణాధికారి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్‌ రీజినల్‌ కార్యదర్శి పురుషోత్తం, కడప డిపో కమిటీ సభ్యులు మురళీమోహన్‌, అలెగ్జాండర్‌ పాల్గొన్నారు.

స్టేట్‌ మైనార్టీస్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌గా జఫ్రుల్లా



కడప కార్పొరేషన్‌ : ఆంధ్రప్రదేశ్‌ స్టేట్‌ మైనార్టీస్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌గా వైఎస్సార్‌ జిల్లా, కడప నగరానికి చెందిన షేక్‌ జఫ్రుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. కడప నగరం అల్మాస్‌ పేటకు చెందిన జఫ్రుల్లా కాంగ్రెస్‌ పార్టీలో జిల్లా మైనార్టీ వైస్‌ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీని వీడి, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత జఫ్రుల్లా జిల్లా జాయింట్‌ సెక్రటరీగా కొనసాగుతున్నారు. జఫ్రుల్లాకు పదవి రావడం పట్ల పార్టీ నేతలు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రెండవ రోజుకు యూటీఎఫ్‌ దీక్ష

కడప ఎడ్యుకేషన్‌: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్‌ వద్ద చేపట్టిన దీక్ష గురువారం రెండవ రోజుకు చేరింది. ఈ దీక్షలలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంఏ గఫూర్‌ పాల్గొని మాట్లాడారు.